www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 12 మే 2025
5
చిత్తూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక వాయిదా

కడా పీడీ వికాస్ మరమ్మత్

ప్రజాశక్తి- కుప్పంటౌన్

కుప్పం పట్టణంలో కడా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదికను వాయిదా వేస్తున్నట్లు పీడీ వికాస్ మరమ్మాత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలు నిర్వహించాల్సి ఉంది. అయితే పట్టణంలో వెలిసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర జరుగుతున్న వేళ, జాతరలో ప్రశాంత వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం నిర్ణయించినట్లు తెలిపారు. జాతర ఏర్పాట్ల పర్యవేక్షణ కారణంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను వాయిదా వేస్తున్నట్లు పీడీ తెలిపారు. నియోజకవర్గ ప్రజలు సహకరించాలని కోరారు.

టమాటా కేజీ @ 3

- ధర రాక.. కొనేవాళ్లు లేక.. రైతుల ఆందోళన
- ఎకరాకు రూ.3 లక్షలకు పైగా ఖర్చు
- 15 కేజీల బాక్స్ రూ.50 నుండి 60ల లోపే..
- సోమల మండలంలో 5 వేల ఎకరాలలో
- గంగవరం మండలంలో 2వేల ఎకరాల్లో ఉన్న సాగు

ప్రజాశక్తి- సోమల, గంగవరం: టమాటా పంట సాగు చేసిన రైతు ధరలు ఆశించినమేర లేకపోవడంతో కొనడానికి ఎవరూ రాకపోవడంతో దిగులు చెందుతూ చేసిన అప్పులు తీర్చలేక, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన నగలు ఎలా విడిపించుకోవాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో దాదాపు ఐదు వేల ఎకరాలకు పైగా టమాటా పంట సాగు చేశారు. ఒక్క ఎకరా దుక్కిదున్నడం, కూలీలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, టమాటా విత్తనాలు, పేపర్, బిందు సేద్యం పరికరాలు, కట్టెలు, పురి దారాలు, ఇతరత్రా మొత్తం కలిపి దాదాపు రూ.2.50 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. సాగు చేసిన నాటి నుండి 60 నుండి 70 రోజులలోపు మొదటి కోత టమాటా పంట రైతుకు చేతికి వస్తుంది. కూలీలను ఏర్పాటు చేసి మొదటి కోతకు వచ్చిన టమాటాలను కోసి బాక్సులలో వేసి పలమనేరు, పుంగనూరు కలికిరి మార్కెట్లకు తరలిస్తూ ఉంటారు ఇక్కడి రైతులు.

2022, 23, 24 సంవత్సరాలలో మండలంలో టమాటా సాగుచేసిన రైతులకు పెట్టుబడులు పోను లాభాలు వచ్చి రైతులు కాస్తో కూస్తే అప్పులను తీర్చుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం అయినప్పటి నుండి నేటి వరకు 15 కేజీల మొదటి రకం నాణ్యమైన టమాటాలు కేవలం రూ.50 నుండి 60ల లోపు పలమనేరు మార్కెట్లో ధర పలుకుతూ ఉంది. దీంతో పెట్టుబడులు రాక కూలీలకు ట్రాన్స్పోర్టుకు కమిషన్‌కు తమచేతి నుండే డబ్బులు చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక్కో సమయంలో ధరలు లేకపోవడంతో తోటల్లోనే పంటను వదిలివేస్తూ వస్తున్నారు. మరి కొంతమంది రైతులు తమ పాడి పశువులకు టమాటా పంటను మేతగా వేస్తూ పశువులు తినడానికైనా ఉపయోగపడుతున్నాయని వాటికి మేత వేస్తున్నారు. అధిక శాతం రైతులు అప్పులు చేసి బ్యాంకుల్లో నగలు తాకట్టు పెట్టి టమాటా పంట పండించేందుకు రుణాలు తీసుకుని పెట్టుబడులు పెట్టారు అయితే ధరలు లేకపోవడం నష్టపోతున్నారు.

ఏ టీ అంగడిలో విన్నా.. ఎక్కడ నలుగురు చేరిన మాట్లాడుకుంటున్నా మండలంలో టమాటా పంటపైనే వచ్చే నష్టాలను గురించే మాట్లాడుకోవడం ధరలు లేక రైతులు పడుతున్న బాధలు, కష్టాలకు నిదర్శనం. మండలంలోని కందూరు, నెల్లిమంద, సోమల, ఇరికిపెంట, నంజంపేట, ఆవులపల్లి, పెద్ద ఉప్పరపల్లి పంచాయతీలలో అధికంగా టమాటా పంటను రైతులు సాగు చేశారు. మండల కేంద్రానికి చెందిన వరదం వెంకటరమణ అనే రైతు మాట్లాడుతూ మూడు ఎకరాలలో టమాటా పంట సాగు చేశామని ఇప్పటివరకు రూ.16 నుండి 19 లక్షలు ఖర్చు చేశామని కానీ గిట్టుబాటు ధర లేకపోవడంతో పంట నష్టం తప్పడం లేదన్నారు. బాగా ధర వస్తేనే పెట్టిన పెట్టుబడులు, సాగు ఖర్చులు, అప్పులు తీర్చుకుని గట్టున పడే అవకాశం ఉందని అన్నారు.

పశువులకు మేతగా టమాటాలు

ప్రస్తుతం మార్కెట్లో టమాటా ధరలు పూర్తిగా పడిపోయి కిలో టమాటా మూడు రూపాయలు మాత్రమే పలుకుతోంది. గంగవరం మండలంలో దాదాపు 2000 ఎకరాల దాకా వివిధ దశల్లో టమాటా పంట సాగులో ఉంది. గతంలో టమాటాకు మంచి ధర పలికి గిట్టుబాటు రావడంతో ఈ సారి ఎక్కువ మంది రైతులు టమాటా పంట సాగుపై మొగ్గు చూపారు. మండలంలోని రైతు నాగరాజు మాట్లాడుతూ గతంలో టమోటా కిలో రూ.150ల చొప్పున కూడా అమ్మిన రోజులు ఉన్నాయని, అందుకే సీజన్లో ఎక్కువగా టమాటా పంటే సాగు చేస్తున్నామన్నారు. ఒక ఎకరా పంట సాగు చేయడానికి, మార్కెట్‌కు తరలించే వరకు మొత్తంగా లక్ష వరకు ఖర్చు అవుతుంది, ధర బాగుంటే అంతకు మించి ఆదాయం వస్తుందన్న ఆశతో పంట వేశామని, కానీ ధర లేదని, పంట కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కూలీల ఖర్చు అయినా మిగిలుతుందని పంట పొలాల్లోనే టమాటాలను కోయకుండా వదిలేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ధరలు పూర్తిగా పడిపోవడంతో పెట్టుబడిలో 20 శాతం కూడా చేతికిందని పరిస్థితి ఉందని మరో రైతు బీర్ గౌడ్ తెలిపారు. తనకున్న పొలంలో రెండు దశలలో 10,000 టమాటా మొక్కలు నాటా సాగు చేయానని, మొదటి దశలో ఆశించిన ధర లేకపోయినా రెండో దశలో అయినా ధర వస్తుందనుకుంటే నష్టమే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్లో ధర 10 కిలోల బాక్స్ కేవలం రూ.31లు మాత్రమే అని, పొలం దగ్గర నుండి మార్కెట్‌కు తరలించడానికి బాక్స్‌కు లగేజీ రూ.13లు, బాక్స్‌కు కమిషన్ రూ.2లు వెరసి మొత్తం ఒక బాక్స్‌కు రూ.15లు, ఇంకా కూలీలు ఖర్చు చెల్లించాల్సి వస్తోందని, గిట్టుబాటు ధర లేకపోగా తమ సొంత డబ్బులు ఇచ్చే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.


టమాలలను కోసి గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఏడు అడుగులు పొడవుగా పెరిగిన టమాట చెట్లు

జీవో 117 రద్దు చేయకుంటే...
ఉద్యమం.. ఉధృతం..

- నేడు కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ నిరసన
- స్పందించకుంటే 15న విద్యాభవన్ ముట్టడి

ప్రజాశక్తి- తిరుపతి : విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమించనున్నారు. 3, 4, 5 తరగతుల విలీనం, జీవో 117 పేరుతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలు చేపట్టడం దుర్మార్గమని వాపోతున్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందని, ఫలితంగా 10లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి తరలిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవో 117 రద్దు చేస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలంగా తయారు చేస్తామని చెప్పిన టిడిపి ప్రభుత్వం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న దుర్మార్గమని పేర్కొంటూ నేడు జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవడం గమనార్హం.

పాఠశాలల పునఃవ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారమై పాఠశాల విద్యాశాఖ అనుసరిస్తున్న ప్రభుత్వ వైఖరిని విద్యార్థి ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రికగ్నైజుడు ఉపాధ్యాయ సంఘాలతో ప్రతివారం విద్యాశాఖ అధికారులు సమావేశమై చర్చిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన సమస్యలపై విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏకపక్షంగా చేపడుతున్న చర్యల వల్ల విద్యారంగం నష్టపోతుందని ఆందోళన చెందుతున్నారు. కొత్తగా 779 హైస్కూల్స్ అప్గ్రేడ్ చేయడం, 9652 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేయడం హర్షణీయమే అయినా హైస్కూల్సులో 54 మంది విద్యార్థులు ఉంటేనే 2వ పోస్టు కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లీష్ స్కూలు అసిస్టెంట్ పోస్టులు సర్ ప్లస్ అవుతున్నాయి. మోడల్ ప్రైమరీ స్కూల్సుకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ స్కూల్సును నిర్వీర్యం చేస్తున్నడం విద్యారంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తోందని ఉపాధ్యాయులు తీవ్ర విచారణ వ్యక్తం చేస్తున్నాం గమనార్హం.

జీవో నెంబర్ 117 ను రద్దు చేయాలి
- జీవీ.రమణ, యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి

జీవో నెంబర్ 117ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలంగా తయారు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణించడం విచారకరం. ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించి పనిభారం పెంచుతోంది. హైస్కూల్సులో 54 మంది విద్యార్థులు ఉంటేనే 2వ పోస్టు కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లీష్ స్కూలు అసిస్టెంట్ పోస్టులు సర్ ప్లస్ అవుతున్నాయి. మోడల్ ప్రైమరీ స్కూల్సుకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ స్కూల్సును నిర్వీర్యం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం కలెక్టరేట్ల ఎదుట ఆందోళనకు సిద్ధమయ్యాం. అప్పటికీ సమస్యలు పరిష్కంచని పక్షంలో మే 15వ తేదీన వేలాదిమంది ఉపాధ్యాయులతో విద్యాభవన్ను ముట్టడిస్తాం.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- మండలంలో రూ.13.86 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- గుడిపాల: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్‌తో కలిసి గుడిపాల మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మొదటగా గత కొన్ని ఏళ్లుగా గుంతలమయమై వాహనాల ప్రయాణానికి ఇబ్బందిగా మారిన పానాటూరు వై-జంక్షన్ రోడ్డును ప్రారంభించారు. రూ.2.30కోట్లతో ఈ రోడ్డును అభివృద్ధి చేసి ప్రయాణికులకు ఉపశమనం కలిగించామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. మండలంలో ఉపాధి హామీ, ఉద్యానశాఖ, జిల్లా పరిషత్, మండల పరిషత్, జిపి నిధులు రూ.13.86 కోట్లతో చేపట్టనున్న 279 పనులకు శంకుస్థాపనలు చేశారు. పశుమంద, వసంతాపురం, కట్టకిందపల్లి, కొలావూరు, బట్టువాళ్ల ఊరు గ్రామాల్లో గోకులం షెడ్లు, నీటి తొట్టెలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు వీలుగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో రోడ్లు, లైట్లు, వీధి దీపాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, ఎంపీడీవో శిరీష, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మండల అధ్యక్షుడు సుబ్బానాయుడు, చంద్ర ప్రకాష్, బాలాజీ నాయుడు, అనీల్, సాంబశివ నాయుడు, హేమాద్రి నాయుడు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలి

- బి.వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వేసవి సెలవులను జిల్లాలోని విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేలా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి సూచించారు. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వేసవి సెలవుల్లోనూ కొంత సమయాన్ని విజ్ఞానం పెంపు కోసం కేటాయించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో విద్యార్థులను గమనిస్తూ బావులు, చెరువులు, కుంటల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో పదవ తరగతికి వెళ్ళనున్న విద్యార్థులకు వేసవి సెలవుల్లో పదవ తరగతి పుస్తకాలను అభ్యసించేలా ప్రోత్సహించడం వల్ల మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు.

ప్రజాశక్తి: వేసవి సెలవులలో విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి...?

డీఈవో: వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్‌లకు పరిమితం కాకుండా కొంత సమయాన్ని చదువు కోసం కేటాయించడం ఎంతో ఉపయోగకరం. విద్యార్థుల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకొని పిల్లలకు చదువు పట్ల ఆసక్తిని కలిగించాలి.

ప్రజాశక్తి: సెలవుల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు...?

డీఈవో: సెలవులంటే విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉంటారు.. ఏడాది కాలం పాటు పుస్తకాలతో కుస్తీ పడ్డ విద్యార్థులు సెలవుల్లో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపేందుకు అత్యధికంగా ఇష్టపడతారు. సరదాగా ఈతాడేందుకు చెరువులు బావులు, కుంటల వైపు వెళ్లే విద్యార్థులను ఓ కంట కనిపెడుతూ ఉండాలి. పెద్దల సమక్షంలోనే చెరువులు, కుంటల వద్దకు వెళ్లేలా చూసుకోవాలి.

ప్రజాశక్తి: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

డీఈవో: చిత్తూరు జిల్లా కేంద్రంలో సైన్స్ పట్ల అవగాహన పెంచేలా అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితం, సైన్స్ పట్ల అవగాహన, శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రీడల పట్ల ఉత్సాహం ఉన్న విద్యార్థులకు వివిధ రకాల క్రీడల్లో శిక్షణ అందించడం జరుగుతుంది.

ప్రజాశక్తి: ప్రభుత్వబడుల్లో అడ్మిషన్లు పెరిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డీఈవో: ప్రతి ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వారి పరిధిలోని ప్రాంతాల్లో అడ్మిషన్ల పెంపు కోసం కృషి చేయడం జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం.

ప్రజాశక్తి: ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారా..?

డీఈవో: ప్రభుత్వం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడం జరిగింది. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీ పోస్టులు భర్తీ కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి మధ్యాహ్నం భోజనం, పుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా అందజేయడం జరుగుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆశిస్తున్నాం.

హంద్రీనీవాతో తీరనున్న కరువు

- శరవేగంగా జరుగుతున్న పనులు
- ఆశగా ఎదురుచూస్తున్న ప్రజలు

ప్రజాశక్తి- వి కోట

కరువు ప్రాంతమైన రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో చేపట్టిన హంద్రీనీవా సుజల స్రవంతి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కృష్ణా జలాలను కరువు ప్రాంతమైన రాయలసీమకు తరలించి జిల్లా చివరి ప్రాంతమైన కుప్పం వరకు నీటిని తరలించి ప్రజల సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో గతంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి. రామారావు ఈ ప్రాజెక్టును చేపట్టారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిచ్చి కరువు నేలకు నీళ్లు మళ్ళించారు. అయితే కాంట్రాక్టర్ల నాణ్యత లోపంతో చేపట్టిన పనుల వల్ల కాలువలో ప్రవహించాల్సిన నీరు కాలవలలోని మట్టి పొరల ద్వారా ప్రవహించి నీరు వృధాగా లీకై బయటకు వెళ్లాయి. అనంతరం అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వంలో హంద్రీనీవా పనులు నత్త నడకన సాగాయి. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కుప్పం నియోజకవర్గానికి నీళ్లు అందించేందుకు రామకుప్పం సమీపంలో నీటిని విడుదల చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే ఈ పనులు పూర్తి చేయకనే నీళ్లు మళ్లించడంతో నీటి ప్రవాహం లేక ఉన్న నీరు ఇంకిపోయాయి. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మరలా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో హంద్రీనీవా కాలువ పనులను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా పుంగనూరు నుండి కుప్పం వరకు ఉన్న కాలువ పనుల్లో నీరు ఇంకిపోకుండా సజావుగా ప్రవహించేందుకు సిమెంట్ కాంక్రీట్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

వేగంగా కొనసాగుతున్న హంద్రీనీవా కాలువ పనులు

క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న కాంక్రీట్ మిక్సింగ్ యూనిట్

పలమనేరు నియోజకవర్గాన్ని దాటి పనులు కుప్పం నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లాలో పర్యటించి హంద్రీనీవా సుజన స్రవంతి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు రూ.3,873 కోట్లు ఖర్చు చేస్తున్నామని, దీనితో రాయలసీమ ప్రాంతంలో సాగు, తాగునీటికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలియజేశారు. దీనితో సంబంధిత అధికారులు పనుల్లో వేగాన్ని పెంచారు. మండలంలో జరుగుతున్న హంద్రీనీవా సుజల స్రవంతి పనులను జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు ఇటీవల పరిశీలించారు. సంబంధిత అధికారులతో పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతను పనులు పూర్తి చేయాలని సూచించారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి అయితే తీవ్ర వర్షాభావంతో అల్లాడే రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నీటి కోసం రైతుల ఎదురుచూపు
- ఏఎం.రంగనాథ్, మండల టిడిపి అధ్యక్షులు

జిల్లా ప్రజలు సాగునీటి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. వర్షపాతం ఒక సంవత్సరం సరిగా లేకుంటే ఇక ఆ ఏడాది పంటను వేసే ధైర్యం చేయలేకపోతున్నారు. హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యి నీటిని అందించగలిగితే రైతులకు సాగునీటి, ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చొరవ తీసుకొని త్వరితగతన పనులు పూర్తి చేయడానికి పూనుకోవడం అభినందనీయం.

సాగు, తాగునీటికి శాశ్వత పరిష్కారం
- రామచంద్ర నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్

హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా కరువు ప్రాంతానికి నీరు రావడంతో సాగు, తాగునీటికి శాశ్వత పరిష్కారం లభిస్తుంది. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న హంద్రీనీవా జలాల తరలింపు పనులు చివరి దశకు చేరుకోవడం అభినందనీయం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో త్వరితగతిన నీటిని విడుదల చేసి తాగు, సాగునీటి సమస్యలకు శాశ్వతం పరిష్కారం చూపుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం.

రూ.7.82 కోట్లతో అభివృద్ధి పనులు

పైలాన్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు రూరల్ మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ఆదివారం అనంతాపురం కాంప్లెక్స్ వద్ద రూరల్ మండలంలో రూ.782.22లక్షలతో చేపట్టనున్న 92 అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు రూరల్ మండలంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతోందని, ఇప్పటికే సిమెంట్ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మించినట్లు చెప్పారు. ఇంకా కాలువలు, రోడ్లు, కొన్ని మౌలిక సదుపాయాల భవనాలు నిర్మించాల్సి ఉందని, రానున్న రోజుల్లో వీటిపై దృష్టి పెడతామన్నారు. బిఎన్ఆర్.పేట వంతెన, రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. మరోవైపు వెంకటాపురం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్వరలోనే ఆరు కంపెనీలు ప్రారంభమవుతాయని ఇందులో స్థానిక యువతకు ఎక్కువ ఉద్యోగాలు ఇవ్వాలని కంపెనీలకు స్పష్టంగా చెప్పామన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, శశికర్ బాబు, జయచంద్ర నాయుడు, మోహన్ రాజ్, మేసక్, శ్యామ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త, వ్యర్థాలు పారపోస్తే చర్యలు తప్పవని, అపరాధ రుసుం వేసి వసూలు చేస్తామని ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ స్పష్టం చేశారు. నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆదివారం నగరంలోని ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. వేలూరు రోడ్డులోని ఒక షాపింగ్ మాల్ వ్యర్థాలను బహిరంగ ప్రాంతాల్లో పడేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు ఇప్పటికే నోటీసులు జారీ చేసినా.. సదరు షాపింగ్ మాల్ నిర్లక్ష్యంగా రోడ్డు పక్కన వ్యర్థాలు పడేయడంతో రూ.2వేలు అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. నగరంలోని షాపింగ్ మాల్స్, దుకాణదారులు తమ వ్యర్థాలను నిర్దేశించిన బిన్‌లోనే వేయాలని, నగరపాలక పారిశుద్ధ్య కార్మికులకు అందివాలన్నారు. రోడ్డుపై పడేస్తే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యాపారి నిజాయితీ

పోగొట్టుకున్న నగలు అప్పగింత

పోగొట్టుకున్న నగలు అప్పగిస్తున్న పోలీసు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వ్యాపారి నిజాయితీతో ఓ వ్యక్తి పోగొట్టుకున్న నగలు తిరిగి అప్పగించడంతో ఆ వ్యక్తి ఆనందం వ్యక్తం చేశాడు. శనివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో జీడినెల్లూరు మండలానికి చెందిన కాంట్రాక్టర్ యోగానందం చిత్తూరులోని చిన్న పిప్ల భవన్ పక్కన ఉన్న 'జ్యోతి ట్రేడర్స్' అనే బియ్యం దుకాణంలో రెండు మూటల బియ్యం కొనుగోలు చేసి తన కారులో పెట్టి కుంటుండగా అనుకోకుండా కారులో ఉన్న బ్యాగును రోడ్డుపైనే ఉంచి మరచిపోయి బెంగళూరుకు బయలు దేరాడు. ఆ బ్యాగులో సుమారు 25 లక్షల విలువ చేసే 240 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఇంటికి వెళ్లి చూసుకొని బంగారు ఆభరణాలు పోగొట్టుకున్నానని తెలుసుకున్న ఆయన చిత్తూరు టూ టౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. టూ టౌన్ ఎస్‌ఐ నెట్టికంటయ్య, సిబ్బంది, వన్ టౌన్ ఎస్‌ఐ మహేశ్వర సిబ్బంది, క్రైమ్ విభాగం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. ఇదే ప్రాంతంలో చిన్న షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్న వినాయక్ అనే యువకుడు ఆ బ్యాగును కనుగొని తన వద్ద భద్రంగా ఉంచి స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించాడు. ఫిర్యాదుదారుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి ఆ బ్యాగు అతనిదే అని నిర్ధారించుకుని అతనికి అప్పగించారు. దీంతో యోగానందం ఆనందం వ్యక్తం చేస్తూ వినాయక్ నిజాయితీని కొనియాడారు. కృతజ్ఞతగా ఐదువేలు నగదును బహుమతిగా అందించారు. చిత్తూరు ఎస్‌పి మణికంఠ చందోలు, చిత్తూరు సబ్ డివిజన్ డిఎస్పీ టిసాయినాథ్ స్పందిస్తూ వినాయక్ నిజాయితీని అభినందించారు.

ఆర్థికంగా అండ... ఆరోగ్యానికి అండదండ

- ఆకాశాన్ని అంటుతున్న తాటి ముంజల ధర
- అయినా వెనుకాడకుండా కొంటున్న ప్రజలు

వేసవి అనగానే మొదటగా గుర్తుకొచ్చేది మామిడి పండ్లు, తాటి ముంజలు. ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ మొదలు కాకపోవడంతో వేసవి తాపాన్ని తీర్చే తాటి ముంజల వైపు ప్రజలు అధికంగా మొగ్గు చూపుతున్నారు. ఎక్కడ చూసినా తాటి ముంజలు అందుబాటులో ఉండడంతో వాటి ప్రయోజనాలు తెలిసిన ప్రజలు వదలడం లేదు. ధరలు అధికంగా ఉన్నా వెనుకాడడం లేదు.

ప్రజాశక్తి- పూతలపట్టు: ప్రస్తుత వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలను అంతో ఇంతో ఆదుకుంటున్నది తాటి ముంజలు. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే దొరికే వీటి ప్రయోజనాలు తెలిసిన వారు నిత్యం ముంజలు తినడానికి ఆసక్తి చూపుతుంటారు. తాటి ముంజులు ఆరోగ్యాన్ని అందించడంతో పాటు వేలాది మందికి ఆర్థికంగా అండగా నిలుస్తోంది. వేసవి వస్తే

తాటి ముంజలు విక్రయిస్తున్న వ్యాపారి

తాటి ముంజల వ్యాపారంతో వేలాది మంది ఆర్థికంగా బలపడతారనేది వాస్తవం. గ్రామీణ ప్రాంతా ల్లోని కొంతమంది నగరాలకు తాటి ముంజలు సరఫరా చేసి లక్షల గడిస్తున్నా రు. మరి కొంతమంది జాతీయ రహదారికి ఇరువైపులా చిన్నపాటి పందిళ్ళు వేసుకొని రహదారిపై వచ్చే పోయే వాహనచోదకులకు తాటి ముంజలు అమ్ముకుంటూ నాలుగు రాళ్ల వెనకేసుకుంటు న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్కడక్కడ తాటిచెట్లు ఉంటాయి. కొందరు వీటిని గుర్తించి ఉచితంగా కొట్టుకొచ్చి అమ్ముకుంటున్నారు. ఇలాంటి వారైతే ఆర్థికంగా మరింత పురోభివృద్ధి చెందుతున్నారు.

తాటి ముంజలతో ప్రయోజనాలు..

తాటి ముంజలు పలువురిని ఆర్థికంగా అభివృద్ధి చేస్తూనే మరికొందరికి ఆరోగ్య పరంగా ఉపకారం చేస్తోంది. తాటి ముంజ లు తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

- ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించడంతోపాటు శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.
- తాటి ముంజల్లోని ఎలక్ట్రోలైట్లు శరీరం లోని ద్రవాలను తిరిగి నింపడంలో సహాయం చేస్తుంది.
- ముంజల్లోని డైటరీ ఫైబర్ పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.
- అంతేకాదు కడుపుబ్బరం, వాయువును తగ్గిస్తుంది.
- చర్మం, మొటిమలు, వేడి, దద్దుర్లు, చికాకు నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

ఆకాశానంటుతున్న ధరలు..

గతంలో ఎన్నడు లేనివిధంగా ఈ మారు ముంజల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కొన్నిచోట్ల డజను ముంజలు రూ.100లు అమ్ముతుంటే.. జాతీయ రహదారి పక్కన రూ.120 నుంచి 150ల వరకు అమ్ముతున్నారు. ఇక కార్లలో వచ్చేవారిని చూసి మరింత ధరలు పెరిగి పోతున్నాయి. ఏదేమైనప్పటికీ గతంలో కన్నా ఈమారు తాటి ముంజలకు డిమాండ్ కూడా భారీగా పెరిగింది.

క్రైం న్యూస్

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : రైలు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రైల్వే పోలీసులు మాట్లాడుతూ ప్రమాదంపై ప్రాథమిక విచారణ చేపట్టామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి- రొంపిచర్ల: ఆర్‌టిసి బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు గాయపడిన సంఘటన మండలంలో పెద్ద గొట్టిగల్లు బస్ స్టాప్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. కడపకు చెందిన ఐదుగురు కారులో తిరుమల వెంకటేశ్వరుని దర్శనార్థం వెళుతుండగా తిరుపతి నుంచి రాయచోటికి వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొనడంతో కారులో ఉన్న ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. వారిలో ఒక మహిళ తీవ్ర గాయాలతో పీలేరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. రొంపిచర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

పట్టుదలతోనే విజయం

ప్రజాశక్తి - గుడిపాల: సాధించాలనే తపన, పట్టుదలతోనే సులభతరంగా విజయాలను సొంతం చేసుకోవచ్చునని సిఎన్ఆర్ విద్యా సంస్థ అధినేత లోకేష్ అన్నారు. జాతీయస్థాయి సాఫ్ట్ బేస్ బాల్ పోటీలలో సిఎన్ఆర్ విద్యాసంస్థ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఇటీవల 12వ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బేస్ బాల్ పోటీలు ఈనెల 8 నుండి 10 వరకు మహారాష్ట్ర రాష్ట్రంలోని సాంగ్లే లో నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్ర రాష్ట్రం నుండి గుడిపాల మండలానికి చెందిన సిఎన్ఆర్ పాఠశాల విద్యార్థులు పాల్గొని గెలుపొందారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో వారిని అభినందిస్తూ జాతియ స్థాయిల్లో మరింత విజయాలు సాధించాలని వారికి సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. మానసిక ఒత్తిడికి లోను కాకుండా ఉండేందుకు క్రీడలు దోహదపడ తాయన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ రంజిత్, ప్రిన్సిపల్ రామచంద్ర, పాఠశాల హెచ్ఎం సుధ లు కూడా క్రీడాకారులను అభినందించారు.

నేడు మొలకల పౌర్ణమి

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని శ్రీ పరుష వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద నేడు సోమవారం మొలకల పౌర్ణమి సందర్భంగా తిరుణాల నిర్వహిస్తూ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం, రాత్రి ప్రత్యేక పూజలు భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది మొలకల పౌర్ణమి సందర్భంగా వేడుకగా ఆలయం వద్ద ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఇందులో భాగంగా సోమవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటల నుండి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. తదుపరి అన్నదాన కార్యక్రమం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు భజనలు కోలాటాలు ఉంటాయని తెలిపారు. మొలకల పౌర్ణమి నిర్వహణ కోసం ఆలయ పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో ముస్తా బు చేశారు.

జవానుకు అశ్రునివాళి

ప్రజాశక్తి- రామకుప్పం : ఇండియా, పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన భారత ఆర్మీ జవాన్ మురళి నాయక్ కు ఆదివారం టిడిపి నేతలు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. టిడిపి కార్యాలయంలో మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని వీర జవాన్ అమరహే, జై భారత్ అంటూ నినాదాలు చేసి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, కృష్ణ నాయక్, వెంకటరమే గౌడు, కామరాజు నాయక్, రఫీ, వెంకటరమణ, విశ్వనాథ్, వెంకటాచలం, సుబ్రీ, బాలు, పాల్గొన్నారు.

మాతృమూర్తులకు సన్మానం

ప్రజాశక్తి ,-పలమనేరు: పలమనేరు పట్టణంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో 150 మంది మాతృమూర్తులకు తమ పిల్లలచే శాస్త్రోక్తంగా పాదపూజ, ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు శ్రీ శ్రీపురం సీతారామయ్య, నాగమణి చారిటబుల్ ట్రస్టు , జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, పలమనేరు రసజ్ఞుల సమాఖ్య, జి ఎస్ ఆర్ జువెలర్స్, జయలక్ష్మి జువెలర్స్, ఆకుల గజేంద్ర, కరణం కిషోర్ తదితరులు సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150 మంది మాతృ మూర్తులకు దాదాపు వెయ్యి రూపాయల విలువ చేసే వస్తువులు, ఒక పట్టు చీర , ఒక గొడుగు, ఒక స్త్రీలు తట్ట, పండ్లు పూజా సామాగ్రి, ఒక తులసి కుండి , ఒక స్వీట్ ప్యాకెట్టు, విందు భోజనం తదితరాలు అందించారు. ముఖ్య అతిథిగా వచ్చేసిన ప్రముఖ డాక్టర్ రామ లక్ష్మమ్మ మాట్లాడుతూ జీవితంలో తల్లికి మించిన దైవం లేదని తల్లి ప్రాముఖ్యతను విపులంగా విశదీకరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపల్లి నరేంద్ర ,డాక్టర్ రామలక్ష్మమ్మ , పుష్ప తులసి నాధం నాయుడు, కరణం కిషోర్, ఆకుల గజేంద్ర పాల్గొన్నారు.

వసుంధర ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన వసుంధర ఎగ్జిబిషన్‌ను ఆదివారం ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎటువంటి వినోదాత్మక కార్యక్రమాలు నోచుకోని చిత్తూరు నగరంలో భారీ ఎత్తున వసుంధర ఎగ్జిబిషన్ పేరుతో ప్రారంభించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదం, ఆహ్లాదం కల్పించడంలో భాగంగా చిత్తూరులో వసుంధర పేరుతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. వివిధ రకాల ఆట వస్తువులతో పాటు తినుబండారాలు, వేల రకాల చాపలతో కూడిన ఎక్వేరియం, ఇతర వస్తువులు పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సైతం కుటుంబ సమేతంగా పిల్లలతో ఎగ్జిబిషన్‌ను సందర్శించాలన్నారు. చూడ చైర్పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, నిర్వాకులు మల్లికార్జున, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి విరుద్ధంగా నడిస్తే చర్యలు: వైసిపి

ప్రజాశక్తి -శాంతిపురం: పార్టీ విధివిధానాలకు విరుద్ధంగా ఎవరి నడిచినా చర్యలు తప్పవని మండల వైసీపీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి జిల్లా ఉపాధ్యక్షులు కోదండ రెడ్డిలు అన్నారు. ఆదివారం కోదండ రెడ్డి నివాసంలో మండల వైసీపీ నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ జడ్పిటిసి శ్రీనివాసులు, వసనాడు మురళి, చీలేపల్లి రవి, నీలా జగదీష్‌లు పార్టీకి విరుద్ధంగా నడుచుకోవడం వల్ల అధిష్టానం ఆదేశాలతో పార్టీ నుండి తొలగించారన్నారు. స్థానిక ఎన్నికల్లో సొంత పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కి మోసం చేసి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు దోహదపడిన శ్రీనివాసులను అప్పుడే సస్పెండ్ చేయాల్సిందని పార్టీకి నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో మొదటి తప్పుగా హెచ్చరించి వదిలేశారన్నారు. మిగిలిన వారు కూడా పార్టీకి నష్టం చేస్తూ వచ్చారు అలాంటి వారిని కూడా క్షమించి పార్టీలో కొనసాగించారని, మరింత తప్పులు చేస్తుంటే వస్తుంటే అధిష్టానం దృష్టికి తీసుకోవడంతో వెంటనే సస్పెండ్ చేసిందన్నారు ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదన్నారు. ఈ సమావేశంలో వైసీపీ ఉపాధ్యక్షులు కోదండ రెడ్డి, కృష్ణమూర్తి, ప్రభాకర్ రెడ్డి, మురుగేష్, నాగరాజు పాల్గొన్నారు.

గంగ జాతరకు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల వ్యాప్తంగా మంగళవారం బుధవారం నిర్వహించనున్న గంగ జాతర్లకు నిర్వాహకులు అంగరంగ వైభవంగా భారీ ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని గంగాధర నెల్లూరు, వేల్కూరు, పెద్ద కాలువ, రామానాయుడు పల్లి లో జరగనున్న గంగ జాతర ఉత్సవాలకు నిర్వాహకులు అంగరంగ వైభవంగా విద్యుత్ దీప కాంతులతో భారీ హోర్డింగులతో భారీ ఏర్పాట్లు చేశారు. మంగళవారం అమ్మవారి ప్రతి మనం ఆవిష్కరించి ప్రత్యేక పూజలు పొంగళ్ళు నైవేద్యాలు అంబళ్లు సమర్పించి బుధవారం సాయంత్రం నీవానది వద్ద నిమజ్జనం వేడుకలు వేడుకగా నిర్వహించను న్నట్లు తెలిపారు.

బంగారు పాలెంలో వర్షం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బంగారు పాలెం మండలం లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 6.20 నుండి 7 గంటల మధ్యలో వర్షం పడడంతో వేసవి తాపం నుండి ఉపశమనం పొందారు.

మాదేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మాదేష్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలో ఆదివారం యమ్‌బియస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అవర్ విజిలెన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 2025 అవార్డు ల ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ ఛైర్మన్ మాదేష్‌కి, వారి సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఓ వి సి ఐ సంస్థ వారు ఘన సత్కారం చేశారు. యన్ హెచ్ ఆర్ సి సి ఎఫ్ ఛైర్మన్, నేషనల్ ప్రసిడెంట్ మాదేష్ కి ఘన సన్మానం...

మెగా హెల్త్ క్యాంపుకు విశేష స్పందన

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ఎంబీటీ రోడ్డులో ఉన్న వి కేర్, ఐవిఎఫ్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో బిగ్ టీవీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంపుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. డాక్టర్ ఖలీలుల్లా, డాక్టర్ అంజుమున్నిసా తో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి విచ్చేసిన సుమారు వంద మంది పిల్లలు లేని తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి 4వేల రూపాయల విలువైన పరీక్షలు ఉచితంగా చేశారు. పిల్లలు లేని తల్లిదండ్రులు సుమారు 100 మంది దాకా ఉచిత మెగా హెల్త్ క్యాంపుకు హాజరయ్యారు. వారందరికీ ఐవీఎఫ్ పద్ధతులను చికిత్స విధానాలను వివరించామన్నారు. ముఖ్యంగా పిల్లలు లేని తల్లిదండ్రులు తమకు పిల్లలు కావాలని చెప్పి ఎంతో ఖర్చు పెట్టుకుని బయట ప్రాంతాలకు వెళ్లి లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టిన ఫలితం లేకుండా నిరాశ, నిస్పృహలతో కాలాన్ని వెళ్లదీస్తున్నారు. అలాంటి వారందరికీ పలమనేరులో ఐ వి ఎఫ్ సెంటర్‌లో అత్యాధునిక పరికరాలతో చికిత్సలు చేసి మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 15, 12 సంవత్సరాల పిల్లలు లేని తల్లిదండ్రులకు చికిత్సలు చేసి

వారికి సంతానం కలిగేలా ఈ ట్రీట్‌మెంట్ ఇచ్చామని తెలిపారు. పలమనేరు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయాలకు పునాది నేషనల్ పబ్లిక్ స్కూలు

యజమానులే ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -గంగవరం: విద్యార్థులు విజయాలకు పునాది పాఠశాల విద్య.. అయితే తమ నేషనల్ పబ్లిక్ స్కూలు మీ తెలివైన ఎంపిక అవుతుందని, ఇక్కడ యజమానులే ఉపాధ్యాయులుగా విద్యా బోధన చేస్తున్న ఏకైక స్కూలు నేషనల్ పబ్లిక్ స్కూలు అని ఆ స్కూలు కరస్పాండెంట్ ప్రమోద్ కుమార్ తెలిపా రు. మండల కేంద్రం గంగవరం కీలపట్ల క్రాస్‌లో నూతనంగా నిర్మించిన పబ్లిక్ స్కూల్లో అన్ని మౌలిక వసతులు , విశాల మైన క్రీడా మైదానం , నూతనటెక్నా లజీతో మరుగు దొడ్లు, ఆట వస్తువులు, వీటి పోటీ ప్రపంచాన్ని కను గొనగా అన్ని సౌకర్యాలతో విద్యార్థినులే ధ్యేయంగా ఏర్పరచిన పాఠశాల.. బట్టీలతో మార్కులు రావచ్చేమో కాని జీవితంలో గెలవాలంటే అవసరమయ్యే వ్యక్తిత్వ నిర్మాణంతో కలిసి వ్యవస్థగా ఏర్పాటు చేసిన పాఠశాల అని, కాన్సెప్ట్ బేస్డ్ ఎడ్యుకేషన్ లో భాగంగా ఆరో తరగతి నుండి ఐఐటి, నీట్‌లలో అత్యుత్తమ శిక్షణ. .చదువుతో పాటు కళలు, నృత్యం, పాటలు వంటి వాటితో ప్రావీణ్యత, ఎన్‌సిసిల సౌకర్యం కూడా ఉందని తెలిపారు. పరిశీనాత్మక, ఆచరణాత్మక విజయంతో గణనీ యమైన విద్యా బోధన, ప్రతి విద్యార్థి మీద ప్రత్యేక శ్రద్ధతో వారు పయనించేలా ఉత్తేజ పరచడం, కాన్సిస్టెంట్ స్టూడెంట్ కన్సల్టింగ్ అండ్ మోటివేషన్ సీజన్స్ లాంటివి అన్నీ ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో పాటు అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో శిక్షణలతో కూడిన తమ పాఠశాలలో తల్లిదండ్రులు విద్యార్థులను చేర్చాలని ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. తమ పాఠశాల లో కేజీ నుండి టెన్త్ క్లాస్ వరకు అనుభవం వున్న ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు.

నేషనల్ పబ్లిక్ స్కూలు భవనం

నూతన టెక్నాలజీతో నిర్మితమైన పాఠశాల గది

కరస్పాండెంటు ప్రమోద్‌కుమార్

పాఠశాలలో ఆటల భవనం

అనుమానితులతో జాగ్రత్త: సీఐ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అనుమానితులతో జాగ్రత్తగా ఉండాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని కట్టప్ప గారి పల్లి పంచాయతీ ఎద్దులవారిపల్లి గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ తనిఖీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నూతన వ్యక్తులు గురించి ఆరా తీయాలని, వారి సమాచారాన్ని సేకరించుకోవాలని సమస్యలో ఉన్న గృహాలను సందర్శించి వారి వివరాలు సేకరించామని పాత కేసులలో ఉన్న నేరస్తులకి తిరిగి ఎలాంటి గొడవలకి వెళ్లకుండా ఉండాలని వేసవి కాలంలో అనుమానితులు గ్రామంలో సంచరిస్తుంటారని వారి ద్వారా దొంగతనాల జరిగే ఆస్కారం ఉంటుందని ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ల వాడటం వల్ల సైబర్ నేరాల అధికమై పోతున్నాయని వాటిని నివారించ ాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందన్నారు. రోడ్డు భద్రత సూచనలు పాటించి వాహనాలు నడపాలని వాహనాలు నడిపేటప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని, మద్యం తాగి వాహనం అతివేగంగా నడప కూడదని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ వారిని సంప్రదించి సమస్యను పరిష్కరించు కోవాలన్నారు. ఈ కార్యక్రమం లో ఏఎస్ఐ మల్లప్ప హెడ్ కానిస్టేబుల్ దావూద్ పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఏపీ ఏవీవో, వీఎల్‌వో అసోసియేషన్ ఏకగ్రీవం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏపీ జెవివో, వివిఎల్‌వో అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా యూనియన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి విజయసారథి వ్యవహరించారు. పారా వెటర్నరీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఐక్యమత్యంతో పోరాడి పారా వెటర్నరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని రాష్ట్ర నాయకులు పిలుపు నిచ్చారు. అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా పారా వెటర్నరీ అసోసియేషన్ నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా లోకనాథం, అసోసియేట్ అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా చిట్టి బాబు, ఉపాధ్యక్షులుగా నరసింహులు, శివకుమార్, అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా ప్రదీప్ కుమార్, శ్రీనివాసులు కోశాధికారిగా వసంత కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శశిధర్ రెడ్డి, సేవా నాయక్ లతో పాటు ఉమ్మడి జిల్లాల పారా వెటర్నరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగన్ వద్దే తేల్చుకుంటాం!

శాంతిపురం జెడ్‌పిటిసి శ్రీనివాసులు

ప్రజాశక్తి -శాంతిపురం: వైసీపీ నుండి తొలగింపు విషయమై మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వద్ద తేల్చుకుంటామని శాంతిపురం జెడ్‌పిటిసి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం తన నివాస ఆవరణలో వైసిపి అసమ్మతి కార్యకర్తలతో కలిసి పార్టీ నుండి తొలగింపునకు గురైన వసనాడు సర్పంచ్ మురళి, చిలేపల్లి రవి, నీల జగదీష్ తో కలిపి సమావేశం నిర్వహించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడు తూ తాను ప్రజల వద్ద ఎన్నికైన ప్రజాప్రతినిధిని అని, ప్రజలకు సేవ చేయడంలో తాను ఎప్పుడూ ముందుంటానన్నారు అధికారంలో ఉన్నప్పుడు కొంత మంది చేసిన తప్పులను ఎత్తిచూపడం వల్లే తనపై కక్షతో పార్టీ నుండి గొలగించారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత గత పది నెలల నుంచి అధికార పార్టీ కార్యకర్తలపై పెడుతున్న హింసను తట్టుకోలేక వారికి భరోసా కల్పించేం దుకు కుప్పం నియోజకవర్గ సమన్వయ కర్త భరత్ అందు బాటులో లేకపోవడం కార్యకర్త లు చాలా బాధపడు తున్నారన్నారు. అలాంటి విషయాలపై కార్యకర్తలు భరోసా కల్పిస్తూ ధైర్యం చెప్పడంతో ఓర్వలేకనే భరత్ ఇలాంటి నిర్ణయాలు తీసుకు న్నారని తెలుస్తోందని, ఆయన తన అనుచరులను తొలగించిన విషయంపై నేరుగా అధిష్టానంతోనే తేల్చు కుంటామన్నారు. ఇప్పటికీ తన వెంట ఉన్న కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరగకుండా తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఎవరు ఎన్ని ఇబ్బందులు కలిగించినా వైసిపిని, జగన్మోహన్ రెడ్డిని వీడేది లేదని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడం

ప్రజాశక్తి-పెద్ద పంజాణి: మండలంలోని బట్టందొడ్డి సచివాలయ ఆవరణలోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణ దారులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సచివాలయ ఆవరణంలో భూమి ఉంటే భవిష్యత్తులో ప్రభుత్వానికి సంబంధించిన లేక ప్రజలకు అవసరమైన ఏదో ఒక భవనం నిర్మించడానికి ఉపయోగ పడేది.అయితే కొంతమంది అక్రమంగా ఆ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని ఇటీవల మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శంకరప్ప అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన స్పందన లేకపోవడంతో అక్రమార్కులు దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాగే ప్రభుత్వ కార్యాలయం ఆవరణంలో వున్న ప్రభుత్వ భూమిలో ఇండ్లు నిర్మించుకొని వెళ్లే భవిష్యత్తులో ప్రజలకు అవసరమైన ప్రభుత్వకార్యాలయాలకు భూమి దొరకని పరిస్థితి వస్తుందని ఇప్పటికైన సంబంధిత మండల అధికారులు,జిల్లా స్థాయి అధికారులు అయినా స్పందించి అక్రమ నిర్మాణాన్ని, ప్రభుత్వ స్థలాల కబ్జాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఎంపిడివో కార్యాలయం కార్యాలయం ఆవరణంలో మిషన్ ఫర్ విజన్, చెన్నై శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం సోమవారం కంటి సమస్యలు ఉన్నవారు వైద్య శిబిరంలో పరీక్షించుకుని కంటి ఆపరేషన్ అవసరమైన వారికి చెన్నై శంకర్ నేత్రాలయంలో ఉచిత ఆపరేషన్ చేయనున్నారని తెలిపారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 10 గంటలకు మండల కార్యాలయంలోని కంటి వైద్య శిబిరంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

గుంతలు..కంకర తేలిన రోడ్లు

- ధ్వంసమైన రహదారులు
- ప్రయాణం అత్యంత కష్టం
- పదేళ్లుగా ఇదే దుస్థితి
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు: మండలంలో పలు గ్రామాల రోడ్లు గుంతలు, కంకర తేలి ధ్వంస మయ్యాయి. పదేళ్లుగా దుస్థితి ఇలాగే వున్నా అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రయాణం అత్యంత కష్టంగా మారింది. నెమ్మదిగా వెళ్లినా ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇక అత్యవసర సమయాల్లో వేగంగా వెళ్లాలంటే ఏ సమయానికి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక వాహన చోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. అధికారులు, పాలకులు స్పందించి వెంటనే రహదారులకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతలు..కంకర తేలిన రోడ్లు

మండలంలో పలు గ్రామాలకు వెళ్లే తారు రోడ్లు గుంతలమయంగా మారాయి. కంకర తేలి పోయినా వాటిని పట్టించుకోకపోవడంతో పలువురు వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. చిత్తూరు-పుత్తూరు మెయిన్ రోడ్డులోని గంగాధర నెల్లూరు మండలంలో కలిజవేడు పంచాయతీ బొమ్మవరపల్లి బస్టాప్ నుండి బొమ్మవారిపల్లి గ్రామం మీదుగా పాపిరెడ్డిపల్లి వరకు వెళ్లే తారు రోడ్డు గుంతలమయంగా మారి కంకరరాళ్లు తేలిపోయింది. ఈ రోడ్డు దుస్థితి సుమారు పది సంవత్సరాలు అవుతున్నా ఎలాంటి మార్పు లేకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరత్తూరు పంచాయతీ కుమ్మరపల్లి జంక్షన్ రోడ్డు నుండి సంసాపురం, దళవాయిపల్లి మీదుగా దళవాయిపల్లి బస్టాప్ వరకు, కాలేపల్లి నుండి ఒగ్గు వారిపల్లి, ఎ కనికాపురం మీదుగా మేనాటంపల్లి హైవే రోడ్డు వరకు కంకరరాళ్లు తేలిపోయాయి. తూగుండ్రం పంచాయతీ హైస్కూలు సమీపం ఆదిఆంధ్రవాడ, బాలయ్య, కొత్తూరు, పిల్లారకుప్పం తారు రోడ్డు గుంతల మయంగా మారింది.

దళవాయిపల్లె, కుమ్మరపల్లె మార్గంలో కంకరరాళ్లు తేలిన రోడ్డు

ప్రయాణం అత్యంత కష్టం

చాలా కాలంగా దుస్థితిలో వున్న ఆయా మార్గాల్లో ప్రయాణించాలంటే వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు భయం గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. గతంలో ఈ మార్గంలో ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా వున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు వెంటనే స్పందించి గుంతల రోడ్లకు, కంకర తేలిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి వాహన చోదకుల సమస్యలు లేకుండా రాకపోకలకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతలమయమైన బొమ్మవారిపల్లి రహదారి

తూగుండ్రం ఆదిఆంధ్రవాడ వద్ద ధ్వంసమైన తారు రోడ్డు

ఉట్టిపడిన కళాత్మక ప్రదర్శన

గల్లా వేదాంత సాయి చౌదరి అద్భుత ప్రతిభ

ప్రజాశక్తి - ఐరాల: స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం పరిధిలోని ఆస్థాన మండపంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. చిత్తూరు మురగాని పల్లికి చెందిన శ్రీ రంజని నృత్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కళాత్మక ప్రదర్శన నిజ జీవితంలో జరిగిన సంఘటనల మాదిరే ఉట్టి పడింది. ఈ కళాత్మక ప్రదర్శనలో అభినయం చేసిన కళాకారులందరిలో ఐరాల మండలం పొలకల పంచాయతీ అగ్రహార పల్లికి చెందిన గల్లా వేదాంత్ సాయి చౌదరి అద్భుతంగా నృత్యం చేసి సబికులను అలరించారు. కాణిపాకం దేవస్థానంలోని ఆస్థాన మండపంలో జరుగుతున్న ఈ సాంస్కృతిక దృశ్యాన్ని భక్తులు, గ్రామ ప్రజలు తిలకించి చిన్నారుల నృత్యాన్ని అభినందించారు. భక్తి పారవశ్యం పెంపొందించేలా అభినయం చేసిన కళాత్మక బృందాన్ని పలువురు అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం శ్రీ రంజిని నృత్యాలయ వారు కళాకారులకు జ్ఞాపికలు, మెమొంటోలు, సత్కరించారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక ప్రదర్శన

ఎస్‌సి కమిషన్ దృష్టికి సమస్యలు..

ఆదుకుంటామని ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచంద్ర హామీ

ప్రజాశక్తి- ఎస్‌ఆర్ పురం : ఎస్‌సిల సమస్యలు, ప్రభుత్వ పథకాలు అమలులో ఎస్‌సిలకు జరుగుతున్న అన్యాయాలను బిజెపి నేషనల్ కౌన్సిల్ మెంబర్ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజేంద్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచంద్ర దృష్టికి ఆదివారం తీసుకెళ్లారు. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఎన్ ఎఫ్ డి సి నిధులు దాదాపు 200 కోట్లు వరకు కేంద్రం నిధులు తెస్తే దాన్ని వైసిపి ప్రభుత్వం వాడుకోలేదని ఈ నిధులు తిరిగి వెళ్లాయని వీటిని కూడా తిరిగి పంపుతామని జిల్లాల వారీగా ఎస్‌సిల అభివృద్ధికి ఈ నిధులు కేటాయిస్తామని రామచంద్ర అన్నారు. స్టార్ట్ ఆఫ్ లోన్లు ఎంపికలో బ్యాంకర్లు ఎస్సీలకు అన్యాయం చేస్తున్నారని అర్హులైన వారికి లోన్ ఇవ్వడంలేదని రాజేంద్ర కమిషన్ దృష్టికి తీసుకెళ్లాడు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను పెంచాలని కోరారు. నియోజకవర్గంలో ఎస్సీ కమ్యూనిటీ పై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, ఎస్సీ నాయకులు రవికుమార్, బాబు , భాను,పరదేశి, అశోక్ పాల్గొన్నారు.


ఎస్‌సి కమిషన్ దృష్టికి తీసుకెళుతున్న దళితులు